సాక్షి సంగారెడ్డి
బుధవారం । 23 । అక్టోబర్ । 2024



ఆయుధం అదరహో..

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సిద్దిపేట పోలీసు కమిషనరేట్‌లో మంగళవారం ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. వివరాలు 8లో ►



ప్రాణం తీసిన పంట రక్షణ తీగ

అడవి పందుల బారి నుంచి వరి పంటను కాపాడుకునేందుకు వేసిన కరెంట్ కంచె మహిళతోపాటు రెండు మేకల ప్రాణం తీసింది. వివరాలు 8లో ►



ఇంటి పెరటిలో గంజాయి..

ఇంటి పెరటిలో గంజాయి మొక్కలు సాగు చేస్తుండగా ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. వివరాలు 8లో ►

న్యూస్‌రీల్

ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలి

- ఎస్పీ చెన్నూరి రూపేష్
- జిన్నారం పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రూపేష్

జిన్నారం (పటాన్‌చెరు): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడాలని ఎస్పీ చెన్నూరు రూపేష్ ఆదేశించారు. మంగళవారం జిన్నారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలతో పాటు, కనీస వసతులను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి రోజువారి పిటిషన్లను ఆన్‌లైన్లో నమోదు చేయాలని చెప్పారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో దర్యాప్తును వేగవంతంగా చేయాలన్నారు. ఆన్‌లైన్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు భూ సంబంధిత చీటింగ్ వ్యవహారాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతిరోజు వాహన తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. అక్రమ రవాణా పనులను నిరోధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నేరాల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేయాలన్నారు. సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరించి ప్రజలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట సీఐ సుధీర్ కుమార్ ఎస్ఐ నాగలక్ష్మి పాల్గొన్నారు.

ట్రైనీ పోలీసులు పరీక్షలకు సిద్ధం కావాలి

సంగారెడ్డి జోన్: శిక్షణలో తొమ్మిది నెలల బేసిక్ శిక్షణ పూర్తి కావటంతో ఫైనల్‌లో నిర్వహించే ఇండోర్, అవుట్ డోర్ పరీక్షలకు సిద్ధం కావాలని ఎస్పీ రూపేష్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకుని ఉంటుందని, శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉన్నప్పుడే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవచ్చని చెప్పారు. ఎస్పీ వెంట డీటీసీ ప్రిన్సిపాల్, జిల్లా అడిషనల్ ఎస్పీ సంజీవరావు, వైస్ ప్రిన్సిపాల్, డీఎస్పీ రమేష్, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలును వెంటనే చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం నారాయణఖేడ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నందున కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యంను సైతం కొనుగోలు చేయాలన్నారు. రైతులకు ఇస్తామన్న బోనస్‌ను అన్ని పంటలకు చెల్లించాలని కోరారు. పెసర, సోయా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా రైతులకు ఇబ్బందులకు గురిచేశారని, రైతుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని ఆయన విమర్శించారు.

ఆర్ఐటీఐలో దరఖాస్తులకు ఆహ్వానం



సంగారెడ్డి జోన్: హత్నూరలోని ప్రభుత్వ ఆర్ఐటీఐలో ప్రవేశాల కోసం ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ క్రాంతి ఒక ప్రకటనలతో పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరంలో మొత్తం 172 సీట్లకు గాను 113 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. హత్నూర ఆర్ ఐఐటీఐలో విద్యార్థులకు వివిధ ఆధునిక కోర్సులు అందించనున్నట్లు పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ పొందిన విద్యార్థులకు వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందే అవకాశం ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో కూడా ఉపాధి అవకాశాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కోర్సులకు అర్హత అని పేర్కొన్నారు. సంబంధిత వివరాల కొరకు ప్రిన్సిపాల్ ఫోన్ నంబర్ 9963004960లో సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

గడ్డపోతారంలో డీఎల్‌పీఓ విచారణ

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామపంచాయతీలో మంగళవారం డీఎల్పీఓ అనిత విచారణ చేపట్టారు. అనుమతులు లేకుండా ఓ వెంచర్ ప్రహరీ గోడ నిర్మించిన విషయంలో పంచాయతీ కార్యదర్శి నరేష్ బాబును సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఈ వ్యవహారంలో డీఎల్‌పీఓ వెంచర్ ఏర్పాటు చేసిన స్థలాన్ని పరిశీలించి సమగ్ర విచారణ చేపట్టారు. సేకరించిన వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తానని డీఎల్‌పీఓ అనిత తెలిపారు.

వైద్యసేవలకు పట్టం

పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి కేంద్రం అవార్డు

- నాణ్యతా ప్రమాణాలు, సేవలు బాగున్నాయని కితాబు
- జిల్లాలోనే ప్రథమ స్థానం
- వైద్య బృందం హర్షాతిరేకం

పటాన్‌చెరుటౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. వైద్య సేవలు బాగున్నాయని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం అవార్డు ప్రకటించింది. వంద పడకల సామర్థ్యం ఉన్న ఈ ఆస్పత్రి.. సేవల్లో దూసుకుపోయింది. జాతీయ నాణ్యతా ప్రమాణాల ధ్రువీకరణ సంస్థ లక్ష్య పేరుతో ఈ ఏడాది జనవరి 9 నుంచి 11వ తేదీల మధ్య కేంద్రం బృందం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించింది. ఇక్కడ రోగులకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తంచేసింది.

15 విభాగాల్లో పరిశీలన

ముఖ్యంగా ఆస్పత్రికి వస్తున్న రోగులకు అందుతున్న సత్వర సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలకు సంబంధించి 15 విభాగాల్లో ప్రత్యేక బృందం పరిశీలన చేసింది. ఇందులో భాగంగా కన్సల్టెన్సీ, బ్లడ్ బ్యాంక్, అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్, మెటర్నిటీ, పీడియాట్రిక్, ఆపరేషన్ థియేటర్, పీపీ యూనిట్, ల్యాబ్, ఎస్ఎన్‌సీయూ, రేడియాలజీ, ఫార్మసీ, మార్చురీ, పారిశుద్ధ్యం, సెక్యూరిటీ, హాస్పిటల్ పరిపాలన వంటి అంశాల్లో క్షేత్రస్థాయిలో వైద్యవర్గాలు, రోగుల నుంచి తీసుకున్న ఫీడ్ బ్యాక్‌కు అనుగుణంగా జాతీయ నాణ్యతా ప్రమాణాల ధ్రువీకరణ సంస్థకు సంబంధించి 95 మార్కులు, లక్ష్యలో 93.5 మార్కులు సాధించి, జిల్లాలో ప్రథమ స్థానంలో నిల్చింది. దీంతో ఆస్పత్రి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

మూడేళ్లకు రూ.30 లక్షలు

వైద్యులు, సిబ్బంది కృషి ఫలించింది. ఆస్పత్రికి నిధుల వరద పారనుంది. ఒక్కో బెడ్‌కు రూ.150 చొప్పున వంద బెడ్లకు ఏడాదికి రూ.10 లక్షల చొప్పున మూడేళ్లకు రూ.30 లక్షలు నిధులు రానున్నాయి. ఈ నిధులతో ఆస్పత్రికి అవసరమైన వసతుల రూపకల్పన చేయవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు. తమ ఆస్పత్రికి అవార్డు దక్కడంతో వైద్య సిబ్బంది సంబరపడి పోతున్నారు. ఇది సమష్టి కృషి అని, ఈ అవార్డు తమపై మరింత బాధ్యత పెరిగిందని వారు చెబుతున్నారు. ఇక ముందు కూడా రెట్టింపు ఉత్సాహంతో సేవలందిస్తామని పేర్కొన్నారు.



పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట వైద్యులు, సిబ్బంది దరహాసం

సమష్టి కృషి ఫలితమే



వైద్యవర్గాల సమష్టి కృషి ఫలితంగా ఈ అవార్డు దక్కింది. వైద్యానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటు వైద్యవర్గాలు ఎంతో కష్టపడి పని చేశాం. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఏ సౌకర్యం కావాలన్నా వెంటనే స్పందిస్తున్నారు.

–డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్

ఈడీ.. ఇటు చూస్తే..!

అక్రమార్కుల్లో దడ

- రంగారెడ్డి జిల్లా అధికారులకు ఈడీ సమన్లు
- జిల్లాలోనూ భారీ భూ కుంభకోణాలు
- అసైన్డ్ భూములను పట్టాదారు పాసుపుస్తకాలిచ్చేశారు
- సర్కారు భూములను ధారాదత్తం చేశారని ఆరోపణలు
- అధికారవర్గాల్లో అంతర్గత చర్చ



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో భూకుంభకోణాలకు పాల్పడిన అధికారుల్లో వణుకు మొదలైంది. విలువ చేసే ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేయడంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించి పెద్ద మొత్తంలో దండుకున్న అక్రమారుల్లో ఆందోళన షురువైందనే చర్చ అధికార వర్గాల్లో జరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో భూ కేటాయింపుల విషయంలో ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ఓ అధికారికి సమన్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలోనూ విలువైన ప్రభుత్వ భూములు కబ్జాలకు గురయ్యేందుకు సహకరించిన కీలక ఉన్నతాధికారుల్లో ఆందోళన నెలకొంది. జిల్లాలో పనిచేసిన కొందరు ఉన్నతాధికారులు ప్రభుత్వ భూములకు అన్యాక్రాంతం అయ్యేందుకు ఎన్‌ఓసీలు జారీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. హెచ్‌ఎండీఏ పరిధిలోని మండలాల్లో రూ.వేల కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు పరాధీనం కావడంలో కీలకంగా వ్యవహరించారు. ఈ క్రమంలో ఈ అధికారులు కూడా రూ.కోట్లకు పడగలెత్తారు. బినామీ పేర్లతో విల్లాలు, భూములు కొనుగోలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

- కంది మండలంలోని 11 గ్రామాల పరిధిలోనే 518 ఎకరాల అసైన్డ్ భూమిని ధరణిలో పట్టా భూములుగా రికార్డులను మార్చేశారు. ఈ భూదందాను 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. వెంటనే తేరుకున్న అధికారులు ధరణి రికార్డులను సరిచేసి అసైన్డ్ భూములుగా రికార్డులను సరిచేశారు. హైదరాబాద్ ఐఐటీ, ఓఆర్ఆర్‌కు అతి సమీపంలో ఉన్న ఈ మండలంలో ఎకరం కనీసం రూ.ఐదు కోట్లు పలుకుతోంది.

రామచంద్రాపురం మండలం కొల్లూరులో ప్రభుత్వ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగేందుకు ఎన్‌ఓసీలు మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఉస్మాన్‌నగర్‌లో ఖరీజ్ ఖాతా భూములను అన్యాక్రాంతం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. ఈ గ్రామాలు కోకాపేట్‌కు అతి సమీపంలో ఉంటాయి. ఓఆర్ఆర్ పక్కనే ఉన్నాయి. ఐటీ కంపెనీలుండే ప్రాంతానికి కొద్ది దూరంలో ఉండటంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ గ్రామాల్లో పదుల ఎకరాలను బడాబాబులకు నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ భూమాయలో అప్పటి అధికారులు భారీగా వెనుకేసుకున్నారనే చర్చ జరుగుతోంది.

పట్టాభూములుగా మార్చడంలో వాటిలో వెంచర్లు వేసి ప్లాట్లు చేసి అక్రమార్కులు కోట్లు దండుకున్నారు. ఈ వ్యవహారాన్ని జిల్లాలో పనిచేసిన వెళ్లిన కీలక ఉన్నతాధికారులు వెనకుండి నడిపించారనేది బహిరంగ రహస్యంగా మారింది. ఇప్పుడు ఇలాంటి భూకుంభకోణాలపై ఈడీ దృష్టి సారించిందనే చర్చ జరుగుతోంది.

- పట్టా భూములను నయానోభయానో కొనుగోలు చేయడం.. ఆ పట్టా భూముల సర్వే నంబర్లతో పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేయడం అమీన్‌పూర్, పటాన్‌చెరు, సంగారెడ్డి, జిన్నారం, కంది తదితర మండలాల్లో పరిపాటైపోయింది. పట్టాభూముల పేరుతో వెంచర్లకు, భవనాల నిర్మాణాలకు అనుమతులు తీసుకుని విలువైన ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టి కోట్లు గడించడం పరిపాటైపోయింది. ఇలా ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నప్పటికీ కళ్లు మూసుకున్నందుకు ఈ కీలక ఉన్నతాధికారులకు కాసుల వర్షం కురిసింది. జిన్నారం మండలంలో వారసులు లేని భూములను సైతం చాకచక్యంగా ధారాదత్తం చేశారు. బోగస్ వారసులను, వారికి బోగస్ ఆధార్‌కార్డులను సృష్టించి పట్టాలు మార్పిడి చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలోనూ ఈ అక్రమార్కులు అందిన కాడికి వెనుకేసుకున్నారు. మరోవైపు చెరువులు మింగేయడంలోనూ ఈ అక్రమార్కులు కబ్జాదారులకు వత్తాసు పలికారు. ఈడీ సమన్ల నేపథ్యంలో ఇలా రూ.వేల కోట్లు విలువ చేసే భూదందాలను వెనకుండి నడిపించిన ఈ కీలక ఉన్నతాధికారుల్లో భయాందోళనలు షురువయ్యాయనే ఆసక్తికరమైన చర్చ రెవెన్యూ, ఇతర అధికార వర్గాల్లో జరుగుతోంది.

ఆధార్ తరహాలో అపార్

- ఈ కార్డులోనే విద్యార్థుల సమగ్ర సమాచారం
- తల్లిదండ్రుల అంగీకారం తప్పనిసరి
- కేజీటు పీజీ వరకు 12 అంకెలతో ఐడీ



సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఆధార్ కార్డు తరహాలోనే ఇక ముందు విద్యార్థులకు అపార్ కార్డులు రానున్నాయి. విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు వెళ్లినా.. ఉపకార వేతనాలు రావాలన్నా అపార్ కార్డు ఉండాల్సిందే. కేంద్రం జాతీయ విద్యావిధానంలో భాగంగా ఆధార్ తరహాలోనే వన్ నేషన్ స్టూడెంట్ పేరిట ప్రభుత్వ , ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో కేజీ టు పీజీ వరకు దేశంలోని ప్రతి విద్యార్థికి 12 అంకెలతో కూడిన ఒక ప్రత్యేక ఐడీని అపార్ (ఆటోమేటిక్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కేటాయించనున్నారు. ఇది దేశంలో ప్రతి విద్యార్థికి అందించే గుర్తింపు నంబర్. ఇప్పటికే విద్యార్థి వివరాలు యూ డైస్ ప్లస్‌లో నమోదు చేసిన నేపథ్యంలో అందులోనే తల్లిదండ్రులు సూచించిన సవరణలు చేసి ఆన్‌లైన్‌లో అపార్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి. దీనికి ప్రధానోపాధ్యాయుడి ధ్రువీకరణ తప్పనిసరి. ఆధార్ అనుసంధానమైన చరవాణికి ఓటీపీ వచ్చిన తర్వాత గుర్తింపు నంబర్ జారీ అవుతుంది. ఒకసారి ఆన్‌లైన్‌లో కార్డు వెలువడిన తర్వాత సవరణలకు అవకాశం ఉండదు.

జిల్లాలో 1423 పాఠశాలలు

జిల్లా వ్యాప్తంగా 1,423 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 862, ప్రాథమికోన్నత 191, ఉన్నత పాఠశాలలు 205, కస్తూర్బాలు 20, ఆదర్శ పాఠశాలలు 10, గురుకుల పాఠశాలలు 46, ప్రైవేట్ పాఠశాలలు 442 ఉన్నాయి. వాటిలో 50 లక్షలకు పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. విద్యార్థులకు పాఠశాల స్థాయిలో చైల్డ్ ఇన్ఫో ద్వారా ఒక ఐడీ, కళాశాల స్థాయిలో మరో ఐడీ ఉంటుంది. అయితే కేంద్ర ప్రభుత్వం నూతనంగా అందించే అపార్ కార్డులోనే అన్ని వివరాలు పొందుపరిచి ఉండనున్నాయి. అపార్ కార్డును జీవిత కాలం ఐడీగా పరిగణిస్తారు. ఇందులో విద్యార్థికి సంబంధించిన పేరు, వయస్సు, లింగం, క్యూ ఆర్ కోడ్‌తో పాటు, విద్యార్థి సాధించిన విజయాలు, ఉపకార వేతనాలు, మెమోలు, ధ్రువపత్రాలు, దీనికి ఆధార్ కార్డు కూడా అనుసంధానం ఉండటంతో కుటుంబ వివరాలు కూడా అందుబాటులో ఉంటాయి. ఆన్‌లైన్‌లో నంబర్ లేదా క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే అన్ని వివరాలు తెలుస్తాయి.

ఇవీ ప్రయోజనాలు

అపార్ కార్డు విద్యార్థి గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుంది. అలాగే..విద్యార్థి బ్యాంక్ ఖాతా డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. విద్యా సంస్థలలో ఒక చోట నుంచి మరోచోటుకు ప్రవేశాల నిమిత్తం వెళ్లినప్పుడు, ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదులో ధ్రువీకరణ సులభంగా అవుతుంది. ఉపకార వేతనాలు, ఉద్యోగాల భర్తీ సమయంతో పాటు చాలా సందర్భాలలో అపార్ కార్డు కీలకం కానుంది. సర్టిఫికెట్‌లు పోతే కూడా డీజీ లాకర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంటుంది.

అపార్ కార్డే కీలకం



కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్ వన్ స్టూడెంట్ నేపథ్యంలో అపార్ కార్డును తీసుకొచ్చింది. ఆధార్ తరహాలోనే భవిష్యత్‌లో విద్యార్థులకు అపార్ కార్డే కీలకం కానుంది. ఈ కార్డులో విద్యార్థులకు సంబంధించిన పూర్తి సమాచారం ఉంటుంది. అపార్‌కార్డుకు సంబంధించి తల్లిదండ్రుల నుంచి అంగీకార పత్రం తీసుకోవాల్సి ఉంటుంది. వేరే పాఠశాలలకు వెళ్లాలన్నా, పై చదువులకు కూడా ఈ అపార్ కార్డు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

–వెంకటేశం, డీఈవో



సీఐకి వినతి పత్రం అందజేస్తున్న ప్రజలు

కరెంట్ ఎప్పుడు వస్తుందో.. పోతుందో!

- విద్యుత్ సిబ్బందిని నిలదీసిన జనం
- సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యుత్ సరఫరా సరిగా జరగడం లేదని పలువురు గ్రామస్తులు ధర్నాకు దిగారు. ఈ సంఘటన మండల పరిధిలోని మెటల్‌కుంటలో చోటు చేసుకొంది. వివరాల్లో వెళితే.. మండల పరిధిలోని మెటల్‌కుంట సబ్ స్టేషన్ నుంచి మెటల్ కుంట, బసంత్‌పూర్, కల్బెమల్ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా జరుగుతుంది. సరఫరాలో తరచుగా అంతరాయం ఏర్పడుతోంది. కొద్దిపాటి గాలొచ్చినా, వానొచ్చినా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని బసంత్‌పూర్, కల్బెమల్ తదితర గ్రామాలకు చెందిన ప్రజలు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. సిబ్బంది నిర్లక్ష్యంపై మండిపడ్డారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. పోతుందో తెలియదు.. ఫోన్ చేసినా పట్టించుకునే నాథుడు కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసి ఆరు నెలలు గడుస్తున్నా కనీసం కనెక్షన్ కూడా ఇవ్వడం లేదని, విద్యుత్ స్తంభం విరిగిపోయినా పట్టించుకోవడం లేదని బసంత్‌పూర్ ప్రజలు పేర్కొన్నారు. లైన్‌మేన్ ప్రవీణ్ నిర్లక్ష్యం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైనందని వారు ఆరోపించారు. కాగా, ప్రవీణ్‌ను డీఈఈ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా ఆందోళనకారులపై ఫిర్యాదు చేయడంతో వారిపై కేసులు నమోదయ్యాయి. దీంతో ఆయా గ్రామ ప్రజలు పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. సమస్యను సీఐ హన్మంత్‌కు విన్నవించగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. విద్యుత్ సిబ్బంది సైతం కేసును వెనక్కి తీసుకున్నారు.

గాలికుంటు నివారణ టీకాలను వేయించాలి

హత్నూర(సంగారెడ్డి): నవంబర్ 14వ తేదీ వరకు పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేస్తామని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రాజేశ్వర్, ప్రభాకర్ అన్నారు. మంగళవారం హత్నూర మండలం సికిందలాపూర్, కాసాల గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాల క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు హత్నూర మండలంలో 2,128 పశువులకు టీకాలు వేశామని చెప్పారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారులు సంధ్యారాణి, హేమలత పాల్గొన్నారు.

11 నుంచి చెరకు క్రషింగ్ ప్రారంభం

- గోదావరి-గంగా కర్మాగారంలో 14న ముహూర్తం ఖరారు
- జహీరాబాద్, మొగుడంపల్లి మండలాలు నాలుగు కర్మాగారాలకు అలాట్‌మెంట్
- కోహీర్, న్యాల్‌కల్, ఝరాసంగం, రాయికోడ్, రేగోడ్, వట్‌పల్లి మండలాలు మాటూరు కర్మాగారం జోన్ కిందకు..



చెరకు కోత కోసం సిద్ధంగా ఉన్న యంత్రాలు

జహీరాబాద్: చెరకు క్రషింగ్‌కు ఆయా కర్మాగారాల యాజమాన్యాలు ముహూర్తం ఖరారు చేశాయి. సంగారెడ్డిలోని గణపతి చక్కెర కర్మాగారంలో యాజమాన్యం నవంబర్ 4న పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం 11వ తేదీ నుంచి రెగ్యులర్ క్రషింగ్‌ను నిర్వహించేందుకు వీలుగా సమాయత్తం అవుతోందని కేన్ అధికారులు పేర్కొంటున్నారు. రాయికోడ్ మండలం మాటూర్ గ్రామంలో గల గోదావరి-గంగా చక్కెర కర్మాగారంలో నవంబర్ 4వ తేదీన పూజా కార్యక్రమాలు నిర్వహించి 14వ తేదీ నుంచి రెగ్యులర్ క్రషింగ్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది. మటూర్‌లోని గోదావరి-గంగా చక్కెర కర్మాగారం ఈ ఏడాది కొత్తగా ప్రారంభిస్తున్నారు. రోజుకు 2,500 టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కర్మాగారం కిందకు ట్రైడెంట్ చక్కెర కర్మాగారం జోన్ పరిధిలో ఉన్న కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, రాయికోడ్ మండలాలతో పాటు రేగోడ్, వట్‌పల్లి మండలాలను కేటాయించారు. 2024–25 సీజన్‌కు గాను సుమారు 2.50లక్షల టన్నుల క్రషింగ్‌ను నిర్వహించే లక్ష్యంతో ప్రణాళికలను సిద్ధం చేసుకుంది. రైతుల దగ్గరి నుంచి ఇప్పటికే 7,212 ఎకరాల చెరకు పంటను యాజమాన్యం అగ్రిమెంట్ కుదుర్చుకుంది. జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోని చెరకు పంటను సంగారెడ్డిలోని గణపతి చక్కెర కర్మాగారంతో పాటు మహబూబ్‌నగర్‌లోని కొత్తకోటలతో పాటు మాగి, గాంధీ చక్కెర కర్మాగారాలకు తరలించేందుకు వీలుగా అధికారులు ఏర్పాట్లు చేశారు.

చెరకు కోత కోసం కూలీలు, యంత్రాలు సిద్ధం

చెరకు కోతకు అవసరమైన మేర యాంత్రిక, వ్యవసాయ కూలీలను మాటూర్‌లోని గోదావరి-గంగా యాజమాన్యం ఏర్పాట్లు చేసుకుంది. కర్మాగారం పరిధిలో ఇప్పటికే 10 చెరకు కోత యంత్రాలను సిద్ధం చేసి పెట్టుకుంది. ఈ యంత్రాలను నిత్యం 900 టన్నుల మేర చెరకును కటింగ్ చేయనున్నారు. 85 కూలీ గ్యాంగులకు మహారాష్ట్ర, నారాయణఖేడ్ ప్రాంతాలతో పాటు స్థానికంగా ఉన్న కూలీలతో ఏర్పాటు చేసుకున్నారు. కూలీలతో నిత్యం 1,500 టన్నుల మేర చెరకును క్రషింగ్ నిమిత్తం నరకనున్నారు.

ట్రైడెంట్‌లో క్రషింగ్ అనుమానమే?

జహీరాబాద్ మండలం కొత్తూర్(బి)లో గల ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో 2024–25 సీజన్‌కు గాను క్రషింగ్ అనుమానంగానే ఉంది. కర్మాగారం ప్రతినిధులు మాత్రం క్రషింగ్ చేపట్టేందుకు వీలుగా యాంత్రిక మరమ్మతులు చేపట్టినట్లు పేర్కొంటున్నారు. యాజమాన్యం ఇంకా రైతాంగానికి సుమారు రూ.12లక్షల మేర చెరకు బిల్లులు బకాయి పడిందని అధికారులు పేర్కొంటున్నారు. కర్మాగారం ట్రాన్స్‌కోకు కరెంటు బిల్లులు సైతం బకాయి ఉన్నందున క్రషింగ్ మాత్రం జరుగుతుందో లేదో అనే అనుమానం రైతాంగాన్ని వెంటాడుతోంది.

క్రషింగ్ ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



చెరకును క్రషింగ్ నిమిత్తం తరలించుకునే విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాం. మాటూర్ కర్మాగారంలో క్రషింగ్ చేపడుతుండటం రైతాంగానికి సంతోషకరమైన విషయం. సామర్థ్యం మేరకు క్రషింగ్ నిర్వహించనుంది. రైతులకు చెరకు కోత, రవాణా ఇబ్బందులు రాకుండా గోదావరి-గంగా యాజమాన్యం ఏర్పాట్లు చేసింది. ఇతర కర్మాగారాలకు చెరకును తరలించుకునేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేశాం.

–రాజశేఖర్, కేన్ అసిస్టెంట్ కమిషనర్, సంగారెడ్డి

క్లుప్తంగా

దుష్ప్రచారాలపై అఘోరీ ఫిర్యాదు

సిద్దిపేటఅర్బన్: తనను అరెస్టు చేశారంటూ దుష్ప్రచారం చేస్తున్న చానెళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంచిర్యాల జిల్లా కృష్ణపల్లికి చెందిన మహిళా అఘోరీ శివవిష్ణు బ్రహ్మ సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. అనంతరం అఘోరీ మాట్లాడుతూ.. తన గురువును కలిసేందుకు హైదరాబాద్ నుంచి బద్రీనాథ్ వెళ్తుండగా దుద్దెడ టోల్‌గేట్ సమీపంలోకి వచ్చేసరికి తనపై చానెళ్లలో దుష్ప్రచారం జరుగుతోందని తెలిసిందని, వెంటనే సమీపంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాను నిజమైన అఘోరీ కాదని, ఫేమస్ అయ్యేందుకు అఘోరీలా వేషం వేసుకొని ప్రజలను మోసం చేస్తోందని పలు యూట్యూబ్ చానెళ్లు, న్యూస్ చానెళ్లు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. వాటిని అరికట్టి తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్‌ను వివరణ కోరగా ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమేనని, ఫిర్యాదు ఆధారంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇంటి పెరటిలో గంజాయి మొక్కలు సాగు



గంజాయి మొక్కలు పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

అల్లాదుర్గం(మెదక్): ఇంటి పెరటిలో గంజాయి మొక్కలు సాగు చేస్తుండగా ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. ఈ ఘటన అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. మెదక్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వర్ కథనం మేరకు..ముస్లాపూర్ గ్రామానికి చెందిన క్యాసారం అంజయ్య ఇంటి పెరటిలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు దాడి చేసి మూడు మొక్కలు స్వాధీనం చేసుకున్నాం. నిందితుడు అంజయ్యపై కేసు నమోదు చేసి అల్లాదుర్గం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ మాన్‌సింగ్, సిబ్బంది సిద్దయ్య, సర్దార్ అలీ, రవి, వెంకటేశ్, నరేశ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని రక్షించిన పోలీసులు

కుటుంబ సమస్యలతో ఆత్మహత్యాయత్నం



బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఎస్‌ఐ

నంగునూరు(సిద్దిపేట): కుటుంబ సమస్యలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న యువకుడిని పోలీసులు రక్షించారు. రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఆసీఫ్ కథనం మేరకు.. సిద్దన్నపేట గ్రామానికి చెందిన సాయి పురుగుల మందు తాగాడని అదే గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి సమాచారం అందించాడు. సాంకేతిక సహాయంతో సాయి బద్దిపడగ శివారులో ఉన్నట్లు గుర్తించి అక్కడికి చేరుకొని సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. యువకుడి ఆత్మహత్యాయత్నానికి ప్రేమ వ్యవహారమే కారణం పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆయుధం అదరహో..

సిద్దిపేట పోలీసు కమిషనరేట్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

- పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహణ
- ఏకే 47, కార్బన్, 9ఎంఎం పిస్టల్‌తోపాటు పలు ఆయుధాలపై అవగాహన
- పాల్గొన్న1700 మంది విద్యార్థులు
- బాంబులను పసిగట్టే డాగ్స్, స్పీడ్ లేజర్ గన్‌పై వివరణలు



విద్యార్థులతో కలిసి ఆయుధాలను పరిశీలిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సిద్దిపేట పోలీసు కమిషనరేట్‌లో మంగళవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పోలీసులు ఉపయోగిస్తున్న ఆయుధాల పనితీరు, పోలీసు చట్టాలు, షీ టీమ్, భరోసా సెంటర్ సేవలు, సీసీ కెమెరాల ఉపయోగాలు, స్పీడ్ లేజర్ గన్ పనితీరు, ట్రాఫిక్ నిబంధనలతోపాటు పలు రకాల విషయాలపై విద్యార్థులకు పోలీసు అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. సిద్దిపేట పట్టణం, రూరల్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 1,700 మంది విద్యార్థులు ఓపెన్ హౌస్‌లో పాల్గొన్నారు.

పలు అంశాలపై అవగాహన

కమిషనరేట్‌లో నిర్వహించిన ఓపెన్ హౌస్‌లో పోలీసులు వినియోగిస్తున్న ఆయుధాలు ఏకే 47, ఎస్ఎల్ఆర్, కార్బన్, 9ఎంఎం పిస్టల్, బీడీ టీమ్, ఫింగర్ ప్రింట్, క్లూస్ టీం, షీ టీమ్, భరోసా, కమాండ్ కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాలు, రోడ్డు ప్రమాదాలు, స్పీడ్ లేజర్ గన్, ట్రాఫిక్ రూల్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన కిట్, డాగ్ స్క్వాడ్, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై సీపీ అనురాధ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్ర రావు, సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు, ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్, సీఐలు ఉపేందర్, విద్యాసాగర్, శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, కిరణ్, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ దుర్గ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పూర్ణచందర్, విష్ణుప్రసాద్, రాజేశ్, ఎస్‌ఐ నర్సింహారావు, పోలీసు సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ లేజర్ గన్

రాజీవ్ రహదారిపై నిర్ణీత వేగం కంటే ఎక్కువ వేగంతో వెళ్లే వాహనాలను స్పీడ్‌లేజర్ గన్ ద్వారా సిబ్బంది గుర్తించి వాహనాలను ఈ చలాన్ ద్వారా జరిమానా విధిస్తారు. స్పీడ్ లేజర్ గన్ పనితీరును కానిస్టేబుల్ జగదీశ్వర్ సీపీ అనురాధకు వివరించారు. పాఠశాల విద్యార్థులకు సైతం స్పీడ్ లేజర్ గన్ పనితీరు గురించి అవగాహన కల్పించారు.



ఓపెన్ హౌస్‌లో ఆయుధాలను చూపుతున్న పోలీసు సిబ్బంది

ఆయుధాల వివరాలు..

ఇన్‌సాస్ 5.56 ఎంఎం

ఇండియన్ నేషనల్ ఆర్మ్ సిస్టమ్ సంస్థ ఈ ఆయుధాన్ని తయారు చేసింది. 7 కేజీల బరువు గల ఈ ఆయుధం 1999 కార్గిల్ యుద్ధంలో ఉపయోగించారు. 600 మీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేదించొచ్చు. 30 రౌండ్స్ మ్యాగజైన్ కెపాసిటీతో ఈ ఆయుధం ఆటోమెటిక్‌గా పని చేస్తుంది. ఈ ఆయుధాన్ని జవాన్‌లు వినియోగిస్తారు.

అప్‌డేటెడ్ ఇన్‌సాస్ వెపన్

ఎక్స్ కాలిబార్ అనే ఆయుధం ఇన్‌సాస్‌కు అప్‌డేటెడ్ వెర్షన్ ఆయుధం. 4.4 కేజీల బరువు గల ఈ ఆయుధం 700 మీటర్ల దూరంలో ఉన్న టార్గెట్‌ను ఛేదించొచ్చు. 30 రౌండ్స్ మ్యాగజైన్ కెపాసిటీ ఉంటుంది. ఆటోమెటిక్ ఆపరేటీవ్ వెపన్ ఇది.

గ్లాక్ 17 పిస్టల్

ఈ గ్లాక్ 17 పిస్టల్ ఆస్ట్రియా వెపన్. ఫైబర్ బాడీతో ఈ ఆయుధం తయారు చేయబడింది. 17 రౌండ్స్ మాగ్యజైన్ కెపాసిటితో 100 యార్డ్స్ దూరంలోని టార్గెట్‌ను ఛేదించొచ్చు. కిల్లింగ్ రేంజ్ 50 యార్డ్స్ అని సిబ్బంది తెలుపుతున్నారు.

ఏకే 47 ఆయుధం

ఏకే 47 ఆయుధం మేడిన్ రష్యా వెపన్. లైట్ వెయిట్ మెషీన్ ఈ ఆయుధం బరువు 4 కేజీల బరువు ఉంటుంది. 30 రౌండ్స్ మ్యాగజైన్ కెపాసిటీ ఉంటుంది. ఆటోమెటిక్ వెపన్ ఇది. 1000 మీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని ఈ ఆయుధంతో ఛేదించొచ్చు. యూనిట్ కమాండర్ ఈ ఆయుధాన్ని వినియోగిస్తారు.

ఎంపీ 5 వెపన్

ఎంపీ 5 అనే వెపన్ ఆటోమెటిక్ మెషీన్. 30 రౌండ్ల మ్యాగజైన్ కెపాసిటీ గల ఆయుధం 100 యార్డ్స్‌లో ఉన్న టార్గెట్‌ను ఛేదిస్తుంది.

7.62 ఎంఎం ఎల్ఎంజీ వెపన్



7.62 ఎంఎం ఆయుధంతో ఏఆర్ సిబ్బంది రాజశేఖర్

ఈ ఆయుధాన్ని లైట్ మెషీన్ గన్ అని కూడా అంటారు. మెడిన్ ఇండియా వెపన్ 1950లో తయారు చేయబడింది. ఈ ఆయుధం చాలా తక్కువ బరువుతో ఉండి 30 రౌండ్ల మ్యాగజైన్ కెపాసిటీ ఉంటుంది. 1,000 మీటర్ల లక్ష్యాన్ని ఈ వెపన్ ద్వారా ఛేదించొచ్చు. ఈ వెపన్ ద్వారా ఒక నిమిషానికి 900 రౌండ్ల బుల్లెట్లు ఫైర్ చేయొచ్చు.



ఓపెన్ హౌస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

ఘాతక్

ఏకే 47 ఆయుధానికి అప్‌డేటెడ్ వెర్షన్ ఆయుధం ఈ ఘాతక్ వెపన్. 4 నుంచి 5 కేజీల బరువు గల ఈ ఆయుధం 30 రౌండ్ల మ్యాగజైన్ కెపాసిటీ ఉంటుంది. ఈ వెపన్ ద్వారా 1000 మీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేదిస్తారు.



ఘాతక్ వెపన్‌ను చూపుతున్న కానిస్టేబుల్ యాదగిరి

ప్రాణం తీసిన పంట రక్షణ తీగ

- విద్యుదాఘాతంతో మహిళతోపాటు రెండు మేకలు మృతి
- కౌడిపల్లి మండలంలో ఘటన



పొలంలో కాట్రోత్ బుజ్జి మృతదేహం



మృత్యువాత పడిన మేకలు

కౌడిపల్లి(నర్సాపూర్): అడవి పందుల బారి నుంచి వరి పంటను కాపాడుకునేందుకు వేసిన కరెంట్ కంచె మహిళతోపాటు రెండు మేకల ప్రాణం తీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. జాజితండా పంచాయతీ రామాలయంతండాకు చెందిన కాట్రోత్ బుజ్జి (38) మంగళవారం ఉదయం మేకలను మేత కోసం అడవి వైపు తీసుకెళ్లింది. తండాకు చెందిన శోభ వరి పంటను అడవి పందుల బెడద నుంచి కాపాడుకునేందుకు చుట్టూ కరెంట్ వైర్‌తో కంచె ఏర్పాటు చేశారు. మేకలను మేపుతున్న బుజ్జి కరెంట్ కంచెను గమనించకుండా పొలం వద్దకు వెళ్లడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈమెతోపాటు రెండు మేకలు కూడా మృత్యువాత పడ్డాయి. గమనించిన తండావాసులు మృతురాలి భర్త సేవ్యనాయక్, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మహిళ మృతికి కారణమైన వాళ్లు వచ్చేదాక మృతదేహాన్ని తరలించేదిలేదని తండావాసులు ఆందోళన చేపట్టారు.నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకొని మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా చేస్తామని పోలీసులు నచ్చజెప్పారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే పంట యజమాని శోభతోపాటు కుటుంబ సభ్యులు తండాను విడిచి వెళ్లిపోయారు.

ఆస్తి వివాదం.. ఆగిన అంత్యక్రియలు

- మనస్తాపంతో ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య
- ఐదురోజులుగా ఆస్పత్రిలోనే మృతదేహంతో ఆందోళనలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఆస్తి వివాదంతో జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని యువకుడు ఆత్మహ్యకు పాల్పడ్డాడు. ఆస్తిలో వాటా ఇవ్వాల్సిందేనని మృతుడి భార్య, బంధువులు ఆందోళన చేపట్టడంతో ఐదు రోజుల తర్వాత అంత్యక్రియలు జరిగాయి. ఈ ఘటన సదాశివపేట మండల పరిధిలోని తంగడపల్లి గ్రామంలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన సిరిపురం మణయ్య, మణెమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు నవీన్, రాములు, కుమార్తె రజిత ఉన్నారు. గతేడాది చిన్న కుమారుడు నవీన్ మృతి చెందాడు. అతడి భార్యకు భూమి ఇవాల్సి వస్తుందని మణయ్య, మణెమ్మ దంపతులు తమ మూడెకరాల భూమిని అల్లుడు హోంగార్డ్ మల్లేశం పేరుపై సెల్ డీడ్ చేశారు. ఈ విషయం తెలిసి భూమిలో సగం వాటా తనకు ఇవ్వాలని పెద్దకుమారుడు రాములు(32) అడిగాడు. వారు ఒప్పుకోకపోవడంతో మనస్తాపానికి గురై 18న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అదే రోజు రాత్రి సదాశివపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్తిలో తమకు వాటా ఇవ్వాలని మృతుడి భార్య, బంధువులు ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో మృతదేహం ఐదురోజులుగా ఆస్పత్రిలోనే ఉంది. మంగళవారం సమస్య సద్దుమణగడంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారి ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ మహేష్ గౌడ్ తెలిపారు.

రైతులకు హైబ్రీడ్ రకాలను అందించాలి



వీసీ రాజిరెడ్డితో టీచర్స్ అసోసియేషన్ సభ్యులు

ఉద్యాన వర్సిటీ వైస్ చాన్స్‌లర్ రాజిరెడ్డి

ములుగు(గజ్వేల్): హైబ్రీడ్ రకాలను రూపొందించి రైతులకు అందించాలని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దండ రాజిరెడ్డి శాస్త్రవేత్తలకు సూచించారు. వీసీగా ఇటీవలె బాధ్యతలు స్వీకరించిన రాజిరెడ్డిని ములుగు విశ్వవిద్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో మంగళవారం తెలంగాణ హార్టికల్చర్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలతో వీసీ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పనిచేసి సమస్యల పరిష్కారం దిశగా శాస్త్రవేత్తల పరిశోధనలు కొనసాగాలని కోరారు. ఉద్యాన విద్యార్థులు ఉద్యాన పంటసాగు చేసే రైతుల క్షేత్రాల్లోకి వెళ్లి శాస్త్రీయంగా ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తెలుసుకోవాలని సూచించారు. అభ్యుదయ రైతుల అనుభవాల నుంచి విద్యార్థులు నేర్చుకోవాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ హార్టికల్చర్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్.చీనానాయక్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి తమ వంతు కృషి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తూటా జనరల్ సెక్రటరీ సురేశ్ కుమార్, అసోసియేషన్ ప్రతినిధులు సైదయ్య, శ్రీనివాస్, సుచిత్ర, నిఖిల్, ప్రీతంగౌడ్, అశ్విన్ ఇతర శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మృతి



నవీన్‌కుమార్(ఫైల్)

ఝరాసంగం(జహీరాబాద్): విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... జహీరాబాద్ మండల పరిధిలోని హుగ్గెల్లి గ్రామానికి చెందిన నవీన్‌కుమార్(35) ఝరాసంగం మండలంలో విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మండల పరిధిలోని చిల్కపల్లి గ్రామ శివారులో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. మంగళవారం లైన్‌మెన్(ఆర్టిజన్) నవీన్‌కుమార్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేసి ఫ్యూజ్‌లు బిగిస్తున్న క్రమంలో ఒక్కసారిగా కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేశ్ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



అశోక్(ఫైల్)

మర్కూక్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని అంగడి కిష్టాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ దామోదర్ కథనం మేరకు.. మండల కేంద్రమైన మర్కూక్ గ్రామానికి చెందిన అచ్చంగారి అశోక్ (34) సోమవారం గజ్వేల్ మండలంలోని రాయవరం గ్రామానికి పని నిమిత్తం బైక్‌పై వెళ్లాడు. పనులు ముగించుకొని రాత్రి తిరిగి మర్కూక్ గ్రామానికి వస్తుండగా అంగడి కిష్టాపూర్ వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. వెంటనే గజ్వేల్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో కొంపల్లిలోని ఓ ప్రైవేట్ హస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు

లారీ ఢీకొని వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రంగారెడ్డి జిల్లా శంకరపల్లి కి చెందిన క్రిష్ణ (34) హైదరాబాద్ నుంచి శంకరపల్లికి బైక్‌పై సోమవారం రాత్రి వెళ్తున్నాడు. పటాన్‌చెరు సాకి చెరువు దాటాక జాతీయ రహదారిపై సంగారెడ్డి వైపు వెళ్తున్న లారీ క్రిష్ణ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన అతడిని 108 సహాయంతో పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య పార్వతీ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..



కృష్ణ మృతదేహం

నిజాంపేట(మెదక్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కల్వకుంట గ్రామానికి చెందిన ముష్టి కృష్ణ (36) ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం కల్వకుంట గ్రామానికి చెందిన సబ్ స్టేషన్ సమీపంలో మృతి చెంది కనిపించాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

వాల్టాకు చట్టానికి తూట్లు

దర్జాగా చెట్లు నరికివేత



లోడ్ చేస్తున్న కర్రలు

అక్కన్నపేట(హుస్నాబాద్): వాల్టా చట్టాన్ని అతిక్రమించి దర్జాగా పెద్ద పెద్ద చెట్లను నరికేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అక్కన్నపేట మండలం కట్కూర్, దుబ్బతండా గ్రామాల పరిధిలోని రోడ్డుకు ఇరువైపులా పెద్ద వేప, ఇతర చెట్లను నరివేశారు. మంగళవారం కట్కూర్ నుంచి వంకాయతండాకు వెళ్లే మార్గంలో నరికిన చెట్లను వాహనాల్లో లోడ్ చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అటవీ, రెవెన్యూ శాఖ దృష్టి సారించి వాల్టా చట్టానికి తూట్లు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి నాలుగు రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో తొమ్మిది మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి రూ.14వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో విద్యార్థినులకు గాయాలు

మండల కేంద్రంలోని ఎంజేపీలో జెండాలు పాతుతుండగా ప్రమాదం



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్డీవో రమాదేవి

హవేళిఘణాపూర్(మెదక్): విద్యుదాఘాతంతో నలుగురు విద్యార్థినులకు గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే (ఎంజేపీ) బాలికల పాఠశాలలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎంజేపీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి క్రీడలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో మంగళవారం ఉదయం విద్యార్థినులు రజిత, గాయత్రీ, వసంత, తనుష్క క్రీడా జెండాలను పాతుతున్నారు. పైన 11 కేవీ విద్యుత్ వైర్లను గమనించపోవడంతో ఇనుప రాడ్ తగిలి ఒక్కసారిగా కరెంట్ షాక్ కొట్టడంతో విద్యార్థినులు చెల్లా చెదురుగా పడిపోయారు. ఇది గమనించిన పాఠశాల సిబ్బంది విద్యార్థినులు హుటాహుటినా మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. విషయం తెలుసుకున్న మెదక్ ఆర్డీవో రమాదేవితోపాటు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందరెడ్డి విద్యార్థినులను ఆస్పత్రిలో పరామర్శించారు. విద్యార్థినులతో పనులు చేయించడం ఎంతవరకు సమంజసమని ఆర్డీవో కళాశాల ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని..

ఉరేసుకొని యువతి ఆత్మహత్య



అర్చన (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉరేసుకొని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అనంతసాగర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దాసరి కొండయ్య, మల్లమ్మకు ముగ్గురు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. రెండో కూతురు అర్చన(18) గజ్వేల్ పట్టణంలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. గ్రామానికి చెందిన యువకుడిని ప్రేమించానని ఇటీవల ఇంట్లో చెప్పడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో అర్చనకు పెళ్లి సంబంధం చూడగా సరేనని ఒప్పుకుంది. మంగళవారం ఉదయం తల్లిదండ్రులు పొలం పనికి వెళ్లాక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో కానిస్టేబుల్ భార్య

తూప్రాన్: ఆర్థిక ఇబ్బందులతో ఓ కానిస్టేబుల్ భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణ కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. మెదక్ ఎస్పీ కార్యాలయంలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ గుజ్జ భూమేశ్ యాదవ్ పెద్ద భార్య కవిత(38) పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా సమీపంలోని ఓ కాలనీలో నివాసం ఉంటుంది. కానిస్టేబుల్ రెండో భార్యతో మరో చోట ఉంటున్నాడు. కుటుంబ తగాదాలతోపాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా కవిత ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుంది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పంట కోయడానికి వచ్చామని ఇంట్లో చోరీ

- వృద్ధురాలిని కట్టేసి బంగారం, నగదు అపహరణ
- వట్‌పల్లి మండలం పల్వట్ల గ్రామంలో ఘటన



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ అనిల్‌కుమార్

వట్‌పల్లి(అందోల్): సోయ పంటను కోసేందుకు వచ్చామని చెప్పి ఇంట్లోకి చొరబడి గుర్తు తెలియని దుండగులు బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన వట్‌పల్లి మండల పరిధిలోని పల్వట్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్వట్ల గ్రామానికి సంగారెడ్డి గారి సునందమ్మ అనే వృద్ధ మహిళ ఇంట్లో ఒక్కరే ఉంటున్నారు. కుమారుడు బీదర్‌లో నివాసం ఉంటూ వారంలో ఒకటి రెండు సార్లు ఇంటికొచ్చి వ్యవసాయ పనులు చూసుకొని వెళ్తాడు. ఈ విషయాన్ని పసిగట్టిన గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో వృద్ధురాలి ఇంటికొచ్చారు. సోయా పంట కోసేవారమని మీ కుమారుడు పంపించాడని, వర్షం పడేటట్లు ఉంది తలుపులు తీస్తే ఇంట్లో పడుకుంటామని నమ్మబలికారు. వృద్ధురాలు నిద్రలో నుంచి లేచి తలుపులు తీయగా దుండగులు ముఖాలు కనిపించకుండా హెల్మెట్లు ధరించుకొని ఇంట్లో చొరబడ్డారు. ఆమె తలపై కొట్టి కాళ్లు, చేతులు కట్టేశారు. ఇంట్లో రూ.20 వేలతోపాటు ఆమె మెడలోని 5 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. వృద్ధురాలు తెల్లారు జామున కట్టు విప్పుకొని ఇరుగుపొరుగు వారికి, పోలీసులకు చెప్పింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్‌టీంను రప్పించి వేలి ముద్రలను సేకరించారు. విషయం తెలుసుకున్న జోగిపేట సీఐ అనిల్‌కుమార్ చోరీ జరిగిన తీరును పరిశీలించారు. వృద్ధురాలి కుమారుడు వెంకట్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.